# " నీవు ఎవరి యందు నమ్మకముంచియున్నావు"

## (Neevu Yevariyandhu Nammakamunchiyunnavu)

నీవు జీవించుటకు గల హేతువేమి ? నిజమైన సంతోషము సమాధానములో నీవు కలిగియున్నావా ? అర్థవంతమైన, ఉద్దేశపరమైన జీవితము జీవిస్తున్నావా ? లేదా జీవితాన్ని వృథాగా గడుపుతు... మరణము కోసం కనిపెట్టియున్నావా ? జీవితమంటే ఏమిటో ఆశ్చర్యముగా నున్నదా ? ఈ శూన్యతను సంపూర్తిచేయుటకు అనేకవిధములుగా ప్రయత్నిస్తు, నీ ఆత్మ (జీవము) ను తినివేయుచున్నావేమో ? డబ్బు, లౌకిక సంతోషము, కుటుంబము, విద్య ఉద్యోగములు నిత్యమైన సుఖ సంతోషములను నీ హృదయములో ఇచ్చియున్నదా ?

వీటన్నిటికి గల కారణము పాపమే. బైబిల్ ఇలా సెలవిస్తున్నది - " నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు గ్రహించువాడెవడును లేడు, దేవుని వెదకువాడెవడును లేడు. అందరును త్రోవతప్పి యేకముగా పనికిమాలినవారైరి, మేలుచేయువాడు లేడు, ఒక్కడైనను లేడు. ఏభేదమును లేదు; అందరును పాపముచేసి దేవడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు." (రోమా 3 : 11-12, 23)

నీవు, నేను మనమందరము పనికిమాలిన వారమై, పాపులమైతిమి. పాపము నిమిత్తమై నరకము కొరకు బంధింపబడినవారము మాత్రమే కాదు గాని ఈ లోకమున జీవించుటకు ప్రయోజనము లేనివారమైతిమి. ఇలాగున ఉండుటయే దేవుని చిత్తము కాదు.

దేవుడు తన ప్రేమను ఎలా ప్రదర్శించాడో బైబిల్ నందు వ్రాయబడినది." అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిచేయుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను." రోమా 5 : 8. ఆయన పరలోకమునందు మాత్రమే కాక ఈ భూమిలో జీవించునపుడు కూడా మీకు అర్థవంతమైన, విలువైన జీవితమును ఇవ్వాలని దేవుడు ఆశించుచున్నాడు. అందునిమిత్తమే ఆయన నిన్ను సృష్టించెను, జీవించుటకు అనుమతించెను. ఇంకను నీవెందుకు ఆయన ఇచ్చే అవకాశాన్ని త్రోసిపుచ్చుదువు ?

మీ తల్లిదండ్రులు క్రైస్తవులైనంత మాత్రాన నీవు క్రమముగా మందిరమునకు వెళ్లుట వలన గాని, సండేస్కూల్ వెళ్లుట వలన గాని, మీ సమాజములో దానధర్మములు చేయుట వలన, బాప్తిస్మము తీసుకొన్నాను, త్రాగుడు అలవాట్లు వదిలేశాను, పొగత్రాగను అని చెప్పుట వలన పరలోకానికి వెళ్లెదను లేదా నిత్యజీవము పొందుకొనెదనని నీవు చెప్పలేవు. యేసుక్రీస్తుకు నీ హృదయములో స్థలమిచ్చి ఆయనను హృదయపూర్వకముగా అంగీకరించినపుడు లేదా ఆయన యందు విశ్వాసముంచినపుడు మాత్రమే నీ పాపములన్నియు క్షమించబడును, పాప శిక్షావిధి నుండి విడిపించబడెదవు. ఈ విషమై బైబిల్ చెప్పునదమేనగా - " మీరు విశ్వాసము ద్వారా కృపచేత రక్షింపబడియున్నారు; ఇది మీవలన కలిగినది కాదు ; దేవుని వరమే. అది క్రియలవలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు. (ఎఫెసీ 2:8,9).

ఇంకొక దినమున రక్షింపబడెదములే అని దేవునితో చెప్పకు. ఒకవేళ తర్వాత నీవు విచారింతువు. రేపేమి సంభవించునో మీకు తెలియదు. మీ జీవమేపాటిది ? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమైపోవు ఆవిరివంటివారే. (యాకోబు 4 : 14).

ఈ సత్యములను ఇదివరకే నీవు వినినయెడల వాటిని నిర్లక్ష్యము చేయకు. దేవుడు బైబిల్ నందు ఇలా సెలవిస్తున్నాడు - " సర్వశరీరులు గడ్డినిపోలినవారు, వారి అందమంతయు గడ్డిపువ్వువలె ఉన్నది; గడ్డి ఎండును దాని పువ్వును రాలును, అయితే ప్రభువు వాక్యము ఎల్లప్పుడును నిలుచును. (1 పేతు 1 : 24,25). ఇప్పుడే నీతో మాటలాడుచున్న దేవుని నోటిని మూయించుటకు ప్రయత్నించకు. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు నందు విశ్వాసముంచనియెడల దేవుని శిక్షావిధికి, కోపమునకు పాత్రుడవగుదువు.

నిజముగా నీవు దేవుని శిక్షావిధి నుండి తప్పించుకొన ప్రయత్నించినయెడల బైబిల్ ఆ మార్గమును నీకు నేర్పును. " దేవుని కుమారుని అంగీకరించువాడు దేవుని గలవాడు; దేవుని కుమారుని అంగీకరింపనివాడు జీవము లేనివాడే. దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవముగలవారని తెలిసికొనునట్లు నేను ఈ సంగతులు మీకు వ్రాయుచున్నాను (1 యోహాను 5: 12-13).